సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం

- అమల్లోకి ఎలక్షన్ కోడ్
- నియోజకవర్గంలో 246 పోలింగ్ కేంద్రాలు,
- 2,05,120 మంది ఓటర్లు
- మీడియా సమావేశంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె మనోరమ


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మనోరమ

యలమంచిలి రూరల్: కేంద్ర ఎన్నికల సంఘం శనివారం సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. యలమచిలి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సాయంత్రం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.మనోరమ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు అధికార యంత్రాంగానికి సహకరించాలన్నారు. యలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో మొత్తం 246 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ నెల 16 వరకు సిద్ధమైన తుది నియోజకవర్గ ఓటర్ల జాబితా ప్రకారం 2,05,120 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఇందులో పురుషులు 99,760 కాగా మహిళలు 1,05,351 మంది ఇతరులు 9 మంది ఉన్నారన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని,అర్హులైన వారు ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 25 వరకు నమోదైన ఓటర్లు ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం ఉంటుందన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఆమె తెలిపారు. పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందిస్తున్నామన్నారు. 85 ఏళ్ల దాటిన ఓటర్లకు ఇంటి వద్దే ఓటు వేసుకునేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని, ఈ మేరకు వృద్ధుల కోరిక మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం కసరత్తు చేస్తున్నామని తెలిపారు.

పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు

ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమలులోకి వచ్చింది. దీంతో నియమావళిని పక్కాగా అమలు చేసేందుకు ఆర్వో మనోరమ శనివారం సాయంత్రం నుంచి నాలుగు మండలాల అధికారులతో వరుసగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు. నియమావళిని అమలు చేసేందుకు ప్రత్యేక బృందాలు నియమించారు. మూడు స్టాటిక్ సర్విలెన్స్ బృందాలు, మూడు వీడియో సర్విలెన్స్ బృందాలు, మూడు వీడియో వ్యూయింగ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరిగేందుకు 21 రూట్లలో 21 మంది సెక్టోరియల్ అధికారులను నియమించారు.అధికారులతో ఇప్పటికే పలు మార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించామని,ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్వో తెలిపారు.

క్లుప్తంగా

ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు జరిగేలా చూడాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ పాపారావు

మునగపాక : గ్రామాల్లో ఎన్నికల నిబంధనలు సక్రమంగా అమలు జరిగేలా చూడాలని తహసీల్దార్ పాపారావు కోరారు. మండల పరిషత్ హాలులో శనివారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి ప్రారంభోత్సవాలు జరగకుండా చూడాలన్నారు. రాజకీయ నేతలకు సంబంధించిన ఫ్లెక్సీలు, విగ్రహాలకు ముసుగులు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీవో మన్మథరావు, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, డీటీ వినయ్‌కుమార్ సమావేశంలో పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సుజాత


బాధ్యతలు స్వీకరించిన సుజాత

కోటవురట్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా.ఎ.ఆర్.టి.సుజాత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పి.కొండబాబు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వర్తించగా ఏపీ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టడంతో ఆ స్థానంలో ప్రిన్సిపాల్‌గా డా.ఎ.ఆర్.టి.సుజాతను నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆమె బాధ్యతలు చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది సహకారంతో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆమెకు కళాశాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి


గంగాదేవిపేటలో వైద్య సేవలను అందిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర కోరారు. మూలపేట శివారు గంగాదేవిపేటలో శనివారం ఏర్పాటు చేసిన 104 వైద్య శిబిరాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని ఆరోగ్య అధికారి యామిని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రమణి, మెడికల్ అధికారి సత్యనారాయణ, ఆశ కార్యకర్త ఈశ్వరమ్మ సేవలందించారు.

ఉజ్వల యోజన గ్యాస్ కనెక్షన్లు పంపిణీ


పీఎం ఉజ్వల యోజన (ఎల్‌పిజి) కనెక్షన్లు పంపిణీ చేస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట : ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా కొత్తగా మంజూరైన గ్యాస్ కనెక్షన్లను జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పంపిణీ చేశారు. పెంటకోట గ్రామంలో 20 కుటుంబాలకు మంజూరు కాగా వీటిని చిక్కాల రామారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. దారిద్ర్యరేఖకు దిగువన వున్న కుటుంబాలకు పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ప్రవేశ పెట్టిన ఈ పథకం పేదలకు మంచి అవకాశం అన్నారు.

టెన్త్ పరీక్షలకు 1722 మంది

పాయకరావుపేట : ఈ నెల 18 వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని మండల విద్యాశాఖాధికారి కె.ఎన్. గాంధీ తెలిపారు. మండలంలో 1722 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. శ్రీ ప్రకాష్ విద్యానికేతన్, జెడ్పీ బాలికల ఉన్నతపాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కనోస్సా, చైతన్య టెక్నో, ఎస్.నర్సాపురం, పాల్తేరులో గల జెడ్పీ ఉన్నత పాఠశాలల కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు ఎంఈవో తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

నర్సీపట్నం: అబిద్ సెంటర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ కొబ్బరి కాయ కొట్టి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి ఆలయ కమిటీ వారు రూ.12 లక్షలు కేటాయించగా, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కృషితో ప్రభుత్వం రూ.48 లక్షలు మంజూరు చేసిందన్నారు.

ఆలయ కమిటీ చైర్మన్ పెదపాటి గోవిదరావు, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి శ్రీనువాసరావు, వైస్ చైర్మన్ రాజా, జాయింట్ సెక్రెటరీ కుమార్, నూకాలమ్మ దేవాలయం, సిద్ధి వినాయక ఆలయం చైర్మన్లు ధనిమిరెడ్డి నాగు, దేవత అరుణ, పెట్ల అప్పల నాయుడు, వార్డు ఇన్‌చార్జి కణితి అన్నపూర్ణ, కణితి వాసు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యం కోసం కష్టపడి చదువుకోవాలి


ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. మునగపాకలోని ప్రియదర్శిని ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ వార్షికోత్సవం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యం కోసం కష్టపడి చదువుకోవాలన్నారు. పిల్లల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రిన్సిపాల్ వేగి వీరునాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, తేలు నూకరాజు, దాడి ముసిలినాయుడు, పెంటకోట జగన్నాథరావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : మండలంలోని రామన్నపాలెంలో జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మిరెడ్డి నాయుడు బాబు, లాలం శ్రీను, సత్యం, అప్పారావు, తాతారావు పాల్గొన్నారు.

కచ్చితంగా ఎన్నికల నియమావళిని పాటించాలి


సమావేశాన్ని నిర్వహిస్తున్న తహసీల్దార్ అప్పలస్వామి, ఎంపీడీవో వెంకటాచలం

రాంబిల్లి : ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించాలని తహసీల్దార్ బి. అప్పల స్వామి, ఎంపీడీవో వెంకటాచలం ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు, వీఆర్‌ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల నియమావళిపై తహసీల్దార్, ఎంపీడీవో పలు సూచనలు చేశారు. ప్రవర్తన నియమావళిని పాటించని వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం


గోకివాడలో పార్టీ నాయకులతో సమావేశమైన సూర్యనారాయణ

రాంబిల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి గెలిపించాలని యలమంచిలి నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ ఎస్.వి.సూర్యనారాయణ అన్నారు. గోకివాడ గ్రామంలో శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కన్నబాబురాజును భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సేనాపతి సూరిబాబు, ద్వారపురెడ్డి గోవిందరావు, నందవరపు రాఘవ, పందుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి


అమరజీవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముకుందరావు, శాస్త్రవేత్తలు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాగభూషణం

అనకాపల్లి: స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఆదిలక్ష్మి, ఎం.విశాలాక్ష్మి, సీహెచ్. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

భారత రత్న ప్రకటించాలి

అమరజీవి పొట్టి శ్రీరాములకు భారతరత్న ప్రకటించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్లా నాగభూషణం అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులో అమరజీవి విగ్రహం వద్ద జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు 52 అడుగుల విగ్రహాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకుముందు అమరజీవికి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణమోహన్, కార్యదర్శి వినకోట నీలేశ్‌గుప్తా, సహాయ కార్యదర్శులు రొబ్బి మల్లేశ్వర రావు, బల్లా శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు బొడ్డు సోమరాజు, కొత్తూర్తి రామారావు, బూడిద జోగారావు, పెదిరెడ్ల సుజాత, పిరాట్ల నరసింహమూర్తి, ఆర్యవైశ్యసంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు భావనారాయణస్వామి కల్యాణోత్సవం

అనకాపల్లి: స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం భద్రావతి సమేత భావనారాయణస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంపాన సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘ సభ్యులు, భక్తులు హాజరుకావాలని కోరారు.

సీసీరోడ్లు, డ్రైనేజీలకు రూ.12 కోట్లు విడుదల


జగనన్న లే అవుట్‌లో సీసీరోడ్లు, డ్రైనేజీకి శంకుస్థాపన చేస్తున్న ఈఈ జేసీపీ సింగ్

అనకాపల్లి: జగనన్న లేఅవుట్లలో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం రూ.12 కోట్లు విడుదల చేసిందని వీఎంఆర్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.సి.పి.సింగ్ తెలిపారు. మండలంలో సంపతిపురం, వేటజంగాలపాలెం, కుంచంగి గ్రామాలతోపాటు మరో నాలుగు ప్రాంతాల్లోని లేఅవుట్లలో శనివారం ఉదయం శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో మౌలిక సదుపాయల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రెండు మూడు నెలల్లో డ్రైనేజీలు, సీసీరోడ్ల పనులు పూర్తి చేయనున్నట్టు తెలిపారు. అనకాపల్లి జోన్ 81వ వార్డు పరిధిలోని రావు గోపాలరావు కళాక్షేత్రంలో మౌలికసదుపాయాలకు రూ.50లక్షల ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, శంకుస్థాన పనులు చేశామని, రెండు మాసాల్లో పనులు పూర్తవుతాయని ఆయన చెప్పారు.

ఘనంగా గౌరమ్మ సంబరం


వెదురుపర్తిలో గౌరమ్మను దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో శనివారం రాత్రి గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు గౌరమ్మను దర్శించుకుని, పూజలు చేశారు. అనకాపల్లి అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మలసాల భరత్‌కుమార్ గౌరమ్మను దర్శించి, పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువా, జ్ఞాపికతో ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు. ఉత్సవం సందర్భంగా కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సీట్ల కేటాయింపులో సామాజిక న్యాయం

- మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డినే జనం కోరుకుంటున్నారు..
- భారీ మెజారిటీతో గెలుపు సాధిస్తా..
- పాయకరావుపేట వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కంబాల జోగులు


విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు

ఎస్.రాయవరం: పాయకరావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరు కేటాయించు నందుకుగాను , పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, సీఎం జగన్ మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రాజాం నియోజవర్గంలో రెండు దఫాలు భారీ మెజార్టీతో గెలిపించారని , పాయకరావుపేట ఎమ్మెల్యేకి రాజ్యసభ కేటాయించడంతో తనను పాయకరావుపేట పంపారని ఇక్కడ కూడా ప్రజలు ప్రత్యేక ఆదరణ చూపిస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, మహిళలకు పెద్దపీట వేస్తూ ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు కేటాయించారన్నారు. సీట్ల కేటాయింపుతో భారీ మెజార్టీతో అక్కడ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి, పాయకరావుపేటలో తాను ఎమ్మెల్యే గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు. అవినీతి లేకుండా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్ర ప్రజలు మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఎదురు చూస్తున్నారన్నారు. మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు గరగా శ్రీను, వెంకటరమణ పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ నిధులతో అభివృద్ధి


సంతబయిల కాలువ వద్ద స్నానఘట్టాల పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ

మునగపాక : భక్తులు పూజలు, స్నానమాచరించేందుకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ నిధుల ద్వారా మునగపాకలో పరదేశమ్మగుడి దరి కాలువను అనుకొని మహిళలు స్నానమాచరించేందుకు వీలుగా మెట్లు,స్టీల్ రెయిలింగ్ తదితర అభివృద్ధి పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో జిల్లా పరిషత్ నిధులతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, సచివాలయ మండల కన్వీనర్ పొలిమేర గణేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆడారి కాశీబాబు, పార్టీ నేతలు పిల్లి అప్పారావు, కుంది సూర్యనారాయణ, శ్రీనివాసరావు, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే మత్స్యకారులకు గుర్తింపు


ఫిష్ ఆంధ్రా యూనిట్ ప్రారంభిస్తున్న గురునాథరావు


పాల్గొన్న స్థానిక నాయకులు

ఎస్.రాయవరం : రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాకే మత్స్యకారులకు గుర్తింపు నిచ్చి ప్రత్యేక పథకాలు ఇచ్చారని ఉమ్మడి విశాఖ జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షుడు మాతా గురునాథరావు అన్నారు. మండలంలో బంగారమ్మపాలెం గ్రామంలో ఫిష్ ఆంధ్రా రెండవ యూనిట్ శనివారం ప్రారంభించారు. రూ.10 లక్షలతో ప్రారంభించిన యూనిట్‌లో 60 శాతం రాయితీ ప్రభుత్వం నుంచి వస్తుందని చెప్పారు. మత్స్యకారులకు ఇంత పెద్ద ఎత్తున ప్రోత్సాహకం ఏ ప్రభుత్వంలోనూ లేదని చెప్పారు. మత్స్యకారులకు రాయితీతో కూడిన పథకాలతో పాటు, సముద్రంలో చేపల వేట నిషేధం సమయంలో రూ.10 వేలు కూడా అందించి జగనన్న ప్రభుత్వం ఆదుకుందన్నారు. మత్స్యకారులను ఈ కార్యక్రమంలో సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, నక్కపల్లి ఫిషరీస్ అధికారి శృతి, వైఎస్సార్ సీపీ నాయకులు కోదండ, జగ్గ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పాటుపడాలి


మునగపాకలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ


మునగపాక వినాయకుని ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు


మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి రమణమూర్తి రాజును గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. మునగపాకలో శనివారం ఎన్నికల ప్రచారాన్ని పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ముందుగా సంతబయిల వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిదేళ్ల కాలంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు హయాంలో మునగపాక మండలం అభివృద్ధి చెందిందన్నారు. ఎన్నికల హామీల అమలు ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, సచివాలయ మండల కన్వీనర్ పొలిమేర గణేష్, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆడారి కాశీబాబు, పార్టీ నేతలు పిల్లి అప్పారావు, ఇంటి శ్రీనివాసరావు, ఆడారి సంతోష్ కుమార్, టెక్కలి గంగునాయుడు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన


రైతులకు, విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న రామకృష్ణ

అనకాపల్లి: పొద్దు తిరుగుడు, నువ్వు పంటల్లో సస్యరక్షణ చర్యలపై శనివారం రైతులతోపాటు అగ్రికల్చర్ విద్యార్థినులకు తుమ్మపాల గ్రామంలో వ్యవసాయశాఖ డివిజన్ ఆత్మ ఏటీఎం రామకృష్ణ అవగాహన కల్పించారు. పొద్దుతిరుగుడు పంటకు ఎక్కువగా శనగపచ్చ పురుగు, నువ్వుపంటకు ఆకుముడత, కాయతొలచు పురుగు ఆశిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థినులు భార్గవి ,చరిష్మా, రైతులు పాల్గొన్నారు.

వజ్ర కవచాలంకృత గోవిందా



కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామిని ప్రత్యేకంగా వజ్ర కవచం, పలు రకాల పూల మాలలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని యువకుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అనకాపల్లి: గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి ఓ యువకుడు(32) మృతిచెందినట్టు దువ్వాడ జీఆర్పీ ఎస్‌ఐ శాంతారామ్ శనివారం చెప్పారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి నుంచి దువ్వాడ వెళ్లే రైలు మార్గంలో కొత్తగా నిర్మించిన ఆరులేన్ల రహదారి బ్రిడ్జి సమీపంలో యువకుడు మృతి చెందాడు. అనకాపల్లి స్టేషన్ మేనేజర్ ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు ఎస్‌ఐ చెప్పారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.